


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

"అమ్మాయిగారూ, ఓ పాలి ముందు గుడిసె కొత్తారూ" ఓ పొలికేక పెట్టింది అలిమేలు అక్కణ్ణించే. అది ఆమె అలవాటని అప్పటికే గ్రహించింది రాజేశ్వరి. ఒక్క పరుగులో అత్తగారి దగ్గరకు వెళ్ళింది. వెళ్లేప్పుడు తినుబండారాలున్న బుట్టను లాక్కుంటూ వెళ్ళింది.

"అయ్యో, ఏందమ్మాయి గారూ ఇది? ఓ కేక పెడితే నేనొచ్చేదాన్ని కదా" అంది అలిమేలు నొచ్చుకుంటూ. నవ్వేసింది రాజేశ్వరి.

"అత్తమ్మా, నాకు మీ మీద చాలా కోపంగా ఉంది." గంభీరంగా మొహం పెట్టి అంది. భయపడి పోయింది అలిమేలు.

"ఏమైంది అమ్మాయి గారు. నా నేటి సేశాను?" అంది బిక్క మోహమేసి.

"కోడల్ని ఎవరన్నా అమ్మాయి గారు, మీరు అంటారా అత్తమ్మా? అలా పిలిస్తే నా అయుష్షు తగ్గిపోదూ?" అంది రాజేశ్వరి.

ఒక్కసారిగా అమ్మయ్య అన్నట్టు నిట్టూర్చింది అలిమేలు." అయితే అమ్మాయిగారూ, అలా పిలిస్తే ఆయుస్సు తగ్గుద్దా? వద్దమ్మా వద్దు, నా ఆయుస్సు కూడా పోసుకుని నూరేళ్ళుండాల నువ్వు "అంది. ఆ ప్రేమకు చలించి పోయింది రాజేశ్వరి.

"అయితే నన్ను ఇప్పటి నించి రాజేశ్వరి అని పిలవండి "అంది లాంతరు వెలిగిస్తూ. ఆమె చేతిలోంచి అగ్గిపెట్టె లాక్కుంది అలిమేలు.

"ఈ పనులన్నీ మీకెందుకు అమ్మాయి గా... అదే రాజేస్వరి గారూ.. దీని తస్సాసెక్కా.. మీ పేరు పలికేందుకు రాటం లేదే" అంది అమాయకంగా తల గోక్కుంటూ.

నవ్వాపుకోలేక పోయింది రాజేశ్వరి." అత్తమ్మా, అయితే మా అమ్మ పిలిచినట్టు రాజూ అని పిలవండి."

"ఇదైతే తేలికేలే రాజమ్మా" అంది అలిమేలు నోరారా నవ్వుతూ.

"అదీ పద్ధతి. సరే పిలిచారేమిటి అత్తమ్మా?"

"సెప్తాలే గానీ రాజమ్మా. నేను నిన్ను రాజమ్మా అంటున్న, నువ్వు నన్ను అత్తమ్మా అంటున్నవ్.బాగుంది పిలుపు. తెలీకదుగుతాను...మీ యమ్మను మీరు అంటావేంటీ?" అంది అలిమేలు సాగదీసుకుంటూ. ఆమె ప్రేమకు లొంగిపోయింది రాజేశ్వరి.

"సరే అత్తమ్మా, మరి మావయ్యగారినీ?" తానూ సాగదీస్తూ అలిమేలు చేతిలో లాంతరు అందుకుని కొక్కేనికి తగిలించింది రాజేశ్వరి.

"నీ ఇట్టం, శ్రీనయ్య ఇట్టం. మద్దెన నాకేటీ? " అనేసింది అలిమేలు. ఆ గడుసుతనానికి నవ్వుకుంది రాజేశ్వరి.

"ఇంతకీ నన్నెందుకు పిలిసావో సెప్పవేంటీ?" అంది నవ్వుతూ.

"రాజమ్మా, నా బస నీ కొద్దమ్మ. నేనే నీ బాస నేర్సుకుంటా, నేరిపిద్దువు. రేత్రికి ఏమి తింటావూ అని అడగటానికి పిలిసా "అంది అలిమేలు

"అన్నం తింటా అత్తమ్మా. మీరేం తింటారూ? " అడిగింది రాజేశ్వరి.

"మేం గంజి తాగేస్తాం రోజూ. కానీ రాజమ్మా, ఇయ్యాల ఇవన్నీ ఉన్నాయిగా తింటానికీ" ఆశగా చూస్తూ అంది అలిమేలు ఎడం చేత్తో ఒక మినపసున్ని తీసుకుంటూ.

"అత్తమ్మా.. ఆ చేత్తో తినేవేవీ ముట్టుకో కూడదు కదా. ఈ చేత్తో తినాలి." ఉలిక్కి పడిన రాజేశ్వరి కొంచెం గట్టిగానే అంది.

"ఓలోలోలె, నాకు తెలీదు కదా తల్లీ. నువ్వు అన్నీ నేర్పు, నేర్సుకుంటా." గబుక్కున సున్నుండని కుడిచేతిలోకి తీసుకుంది అలిమేలు.

"అత్తమ్మ, నేను అన్నీ నేర్పుతా. మంచి అలవాట్లు, పద్ధతులు. మీరు తప్పుగా అనుకోకూడదు. చక్కగా నాలాగా మాట్లాడటం కూడా నేర్పుతా. మీకే కాదు, మన పేటలో అందరికీ, ఎవరికీ కావాలంటే వాళ్లకి. నేర్చుకుంటారా?" ఆశగా అడిగింది రాజేశ్వరి.

ఆమె మొహంలోకి చూస్తూ అంది అలిమేలు. "అందరి ఇసయం నానేటి సెప్పేది తల్లీ. నువ్వు ముందు నాకు నేర్పే బంగారు. నన్ను సూసి వేరే వాళ్ళు కూడా వత్తారులే." అలిమేలు వంక చూసింది రాజేశ్వరి. ఆమె కళ్ళు స్నేహపూర్వకంగా నవ్వుతున్నాయి.

“మీరు గొప్పింటోరు, గొప్ప కులపోరు. ఏం సెప్పినా ఇనాల రాజమ్మా." అంది అలిమేలు భక్తిగా. రాజేశ్వరికి అర్ధమయ్యింది. ఈ భావం పోవటానికి ఇంకా చాలా రోజులు పడుతుందని.

"సరేలే అత్తమ్మా. ఇదిగో నేను ఈ విస్తళ్లలో మినపసున్ని, లడ్లు వంటివన్నీ పెట్టి ఇస్తాను. మన చుట్టాలందరూ ఇక్కడే ఉన్నారన్నవుగా, అందరికీ ఇచ్చి వస్తావా?" అలిమేలు మొహంలో అయిష్టత స్పష్టంగా కనిపించింది.

"అందరికీ ఇయ్యాలా? ఎందుకు రాజమ్మా? మళ్ళీమళ్ళీ ఇలాంటి తిండి మనకు దొరకదు. అట్టేపెట్టుకుని మనమే తిందాం. మనం సేసుకుందామన్నా సేతకావుకదా!" ఆమె మనసు అర్ధమయ్యింది రాజేశ్వరికి.

"అత్తమ్మా, ఇవన్నీ నేను చెయ్యగలను. మరి నీ ఇంటికి కోడలు కాపురానికి వచ్చిందని అందరికీ తెలియద్దూ? అందుకే ఇవి పంచిపెట్టాలి. అసలు పంచిపెట్టటానికే ఇవన్నీ ఇచ్చారు."

"ఔనా, సర్లే రాజమ్మా, పెట్టియ్యి. పంచొస్తా." రాజేశ్వరి వెడల్పైన పళ్ళెంలో సర్దిన వాటిని చంకన బెట్టుకుని పెట్టుకుని బయల్దేరబోయింది అలిమేలు.

"ఏంటి అత్తమ్మా, ఇట్లానే వెళ్తావా?" ఆశ్చర్యంగా అడిగింది రాజేశ్వరి. అర్ధంకానట్లు మొహం పెట్టింది అలిమేలు.

"మరి?"

"కొత్త చీర కట్టుకొని వెళ్ళాలి. ముందు స్నానం చేసి రా అత్తమ్మా."

"అబ్బా, ఇప్పుడెవుళ్లు సేత్తారు? పనంతా అయినంక మాపటేల గదా తానమాడేది?

"అత్తమ్మా, పెద్దింటి కోడలొచ్చిందని మురిసిపోతున్నావే, మరి నువ్వు కూడా పెద్దింటి దానిలాగా తయారవ్వద్దూ? చక్కగా స్నానం చేసి, కొత్తచీర కట్టుకుని, జుట్టు దువ్వుకుని వెళ్తే అందరూ నీ గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటారు?" అలిమేలు బలహీనత మీద దెబ్బ కొట్టింది రాజేశ్వరి.

"అట్టంటవా? సరే, నీ మాటెందుకు కాదనాలి?" సరిగ్గా పదే నిమిషాల్లో స్నానం చేసి, జుట్టు దువ్వుకుని, నుదుట రూపాయి కాసంత బొట్టు పెట్టుకుని, కొత్త చీరలో తయారయ్యింది అలిమేలు.

"రాజమ్మా, ఎట్టున్నాను?" కొంగు సవరించుకుంటూ అడిగింది. తన సామానులోంచి అద్దం తీసి చూపెట్టింది రాజేశ్వరి.

"అత్తమ్మా, మహారాణిలా ఉన్నావు. ఇప్పుడు వెళ్ళు" అద్దంలో తన మొహం చూసుకుని సంబరపడి పోయింది అలిమేలు. స్నానం చేసి బొట్టు పెట్టుకునే సరికి ఆమె మొహం ఆమెకే అందంగా కనిపించింది.

"ఇక నుంచి రోజూ స్నానం చేస్తా రాజమ్మా" అంది. మూర్ఛపోయినంత పనయ్యింది రాజేశ్వరికి. అంటే రోజూ వీళ్ళు స్నానాలు కూడా చెయ్యరా? మనసులోని భావాలు మోహంలో ప్రతిఫలించకుండా చేసుకునేందుకు ఆమె ఎంతో కష్ట పడవలసి వచ్చింది. గుడిసె బయట దూరంగా కనపడుతున్న కొండ ఎక్కలేనంత ఎత్తుగా కనిపించిందామెకు. కానీ ఎంత దూరమైనా ఒక్క అడుగు వేస్తేనే కదా రెండోది పడేది. దూరానికి భయపడకుండా నడిస్తేనే కదా చేరేది!

మరో అరగంటలో పేట పేటంతా కొత్త కోడల్ని చూడటానికి తరలి వచ్చింది. చిన్నాపెద్దా, ముసలీముతకా, అందరు విరగబడి గుమిగూడారు. గుడిసె లోపల ఉన్న రాజేశ్వరికి ఊపిరాడలేదు. ఆమె అవస్థ గమనించిన అలిమేలు అందర్నీ ఒక్క కసురు కసిరి బయటకు తోసింది.

"ఏందీ మీద పడటం? ఆగండాగండి. మా రాజమ్మ బయటి కొస్తుంది. నువ్వు రామ్మా" అంటూ తాను గుడిసె గుమ్మానికి కాపలాగా నిల్చుంది ఎవరూ లోపలకి రాకుండా. అయినా ఒక పదహారేళ్ళపిల్ల ఆమె చేతికింద నుంచి లోపలకు దూరి రాజేశ్వరిని చూసి స్నేహపూర్వకంగా నవ్వింది.

"రా ఒదినా" అంది. ఆమెతో పాటు బయటకు వచ్చింది రాజేశ్వరి. ఆ పేట జనం ముందు ఆమె మెరిసిపోతోంది. అసలే అందగత్తేమో... కట్టిన పచ్చనిచీర ఆమె ఛాయను మరింత ఎత్తి చూపిస్తుంటే, బంగారపు బొమ్మలా ఉంది చూసేవాళ్ల కళ్ళకి.. వాళ్ళందరూ ఆమెను చూసి ఒక అద్భుతాన్ని చూసినట్టు ఆనందించారు. ఐదేళ్ళ పిల్లొకతి చిన్నగా ముందుకు జరిగి ఆమెను తాకి చూసింది ఆమె నిజంగానే అక్కడ నిల్చుని ఉంది అని నిర్ధారణ చేసుకునేందుకు. ఇంచుమించు అందరూ చేతులెత్తి దణ్ణం పెట్టారు ఆమెకి ఒక దేవతకు పెట్టినట్టు. రాజేశ్వరి. ఉబ్బి తబ్బిబ్బైపోయింది వాళ్ళ ప్రవర్తనతో.

ఏమి చెయ్యాలో తోచలేదు. తను కూడా చేతులు జోడించి

"బాగున్నారా?"అంది అందరినీ ఉద్దేశించి. జనంలో హర్షాతిరేకం చెలరేగింది. గోలగోలగా అందరూ జవాబిచ్చారు. రాజేశ్వరికి తనకి తనే ఓ నాయకురాలిలాగా అనిపించింది. ఔను ఎందుకు కాకూడదు? నాన్నలాగా? వీళ్లందరికి తను నాయకురాలవ్వవచ్చుగా! ఒక ఊహ మెదిలింది ఆమె మనసులో.

"ఇంక నువ్వు లోపలకు వెళ్ళు రాజమ్మా"అంది అలిమేలు. మరో పదినిమిషాలకి అందరూరాజేశ్వరిని చూసామని, ఆమె తమను పలకరించిందని చెప్పుకుంటూ, గొప్పతృప్తితో అక్కడనించి వెళ్ళి పోయారు.

★★★★★

బయటకెళ్లిన శ్రీనివాసులు, నాగరాజు, రామరాజు ఇంటికి వచ్చారు. అలిమేలు కొడుకూ కోడళ్ళని కొండమీదున్న గుడికి వెళ్ళి అమ్మవారిని దర్శించుకుని రమ్మంది. నాగరాజు, రాజేశ్వరి కొత్త బట్టలు కట్టుకుని బయలు దేరారు. అలిమేలు వాళ్ళని కంటి నిండుగా చూసుకుంది. మెటికెలు విరిచింది దిష్టి తీస్తున్నట్లు. నడుచుకుంటూ కొండ దగ్గరకి చేరారు కొత్తజంట. ఒక్కసారి తలెత్తి చూసింది రాజేశ్వరి. ఎంతో ఎత్తుగా ఉందా కొండ.

"ఎంతసేపు పడుతుందో ఎక్కటానికి?" తనలో తాను అనుకున్నట్టు అంది.

"పడుచువాళ్లకయితే అరగంట. ముసలివాళ్లకు రెండు గంటలు. నువ్వు పడుచు దానివా, ముసలి దానివా?" నాగరాజు రాజేశ్వరిని ఉడికించాడు. రోషంగా అతని వైపుచూసి కొంగు బిగించి పరిగెత్తుతూ కొండనెక్క సాగింది రాజేశ్వరి. మధ్యలో ఒక్కసారి ఆగారేమో, అంతే! చూస్తూ ఉండగానే పైకి చేరిపోయారు.

"చూసావా, దూరం చూసి భయపడకూడదు." నవ్వాడు నాగరాజు. రాజేశ్వరి మనసులో ఏదో మెరిసింది.

"అవును, దూరం చూసి భయపడకూడదు. గమ్యం తెలిసినప్పుడు ప్రయాణం మొదలుపెడితే దూరం అదే తరిగిపోతుంది." అంది భర్తతో. అమ్మవారు ఎంతో కళగా ఉంది. పక్కనే ఒక చిన్న మందిరంలో అయ్యవారు కూడా ఉన్నారు. ఇద్దరూ మనసారా నమస్కరించుకున్నారు. రాజేశ్వరి అత్తగారు చెప్పినట్లు పసుపు, కుంకుమలని అమ్మవారి పై చల్లి, కొబ్బరికాయ కొట్టింది.

"ఇక్కడ పూజ మనమే చేసుకుంటాం. సత్యం గల తల్లి!" భక్తితో అన్నాడు నాగరాజు. అతనికి ఈ గుడికి ఆమెతో రావటం ఒక కొత్త అనుభవం. అమ్మవారి కుంకాన్ని అతని నొసట దిద్దింది రాజేశ్వరి.

ఇంటికి వచ్చేసరికి అలిమేలు అన్నం వండి ఉంచింది. అందులోకి అప్పుడే వస్తున్న చింతచిగురుని కోసి కందిపప్పులో వేసింది రాజేశ్వరి కోసం. రాజేశ్వరికి ఆ పప్పు ఎంతో నచ్చింది. నాగరాజు, రాజేశ్వరి భోజనాలు ముగించేసరికి చందమామ ఆకాశంలో చారెడంత పైకి లేచాడు. రాజేశ్వరి అప్పుడప్పుడే బజార్లో అమ్ముతున్న మల్లె మొగ్గల్ని కొనుక్కుంది ఇంటికి వచ్చేప్పుడు. ఆమెది బారెడు జడ. ఆ జుత్తుని చూసి ముచ్చటపడి అలిమేలు చక్కగా చిక్కులు తీసి జడవేసింది. అందులో కొనుక్కున్న మల్లెమొగ్గల్ని మాల అల్లి పెట్టుకుంది రాజేశ్వరి, అత్తగారికి చిన్న ముక్క ఇచ్చి. అన్నం తిన్న కాసేపటికే అలిమేలు, శ్రీనివాసులు ఆవలించటం చూసి ఆశ్చర్యపోయింది రాజేశ్వరి. అలిమేలు సిగ్గు పడింది.

"ఏమనుకోబాకమ్మా. తొలికోడి కూసినప్పుడు లెగుస్తా గదా. మీరు గూడా పోయి ఇంక పడుకోండి" అనేసి అక్కడే నేలమీద ఓ బొంత తలకింద పెట్టుకుని నిద్రకి ఒరిగింది. నాగరాజు సైగతో రాజేశ్వరి లేచింది. ఇద్దరూ బయటకి వచ్చి తమ గుడిసె వైపు నడిచారు.

"ఈ కంచె లోపల మనకో ప్రత్యేకమైన గుడిసె. బాగుంది భారత దేశంలో కాశ్మీరంలా." నవ్వాడు నాగరాజు.

"కాశ్మీరు ఇప్పుడు మనదేశంలో భాగం అయ్యింది కదా" అంది రాజేశ్వరి.

"అయ్యిందిలే. మొన్నీ మధ్యేకదా. కానీఈ సమస్య ఇంతటితో అంతమౌతుందనుకోను" అన్నాడు నాగరాజు.

"అబ్బో, మా రాజాకి రాజకీయాల మీద కూడా అవగాహనా ఉందే" వెక్కిరించింది రాజేశ్వరి. "ఇంకేం, మావగారికి తగ్గ అల్లుడే తమరు " నవ్వేశాడు నాగరాజు.

"ఆయన ముందు నేనెంత? ఏనుగు ముందు చీమంత. అది సరేలే గానీ స్నానం చేద్దామా" అన్నాడు నాగరాజు.

"ఇప్పుడా,మళ్ళీనా!" ఆశ్చర్యపోయింది రాజేశ్వరి. మొదటి సారి కొంటెచూపు చూసాడు నాగరాజు రాజేశ్వరి వైపు.

"తొట్టిస్నానం చాలా బాగుంటుంది రా "

ఇంటి వెనకాల ఉన్న దడివైపు లాగాడు రాజేశ్వరిని. సిగ్గు పడుతూనే వెళ్ళింది రాజేశ్వరి. అమాంతంగా ఆమె నెత్తి నీళ్లతో నిండిన తొట్టిలో పడేశాడు నాగరాజు. పక్కనే తనూ దూకాడు. నీళ్లు గలగలా శబ్దం చేశాయి. కిలకిలా నవ్వింది రాజేశ్వరి. అక్కడే ఉన్న పారిజాతం ఆ నీళ్ల తొట్టెలోకి పూల వాన కురిపించింది. రాజేశ్వరి రవిక మీద చీర తప్పించి నాగరాజు నెమ్మదిగా ఆమె వళ్ళు సబ్బుతో రుద్దాడు. సిగ్గుతో మెలికలు తిరిగింది రాజేశ్వరి, అప్రయత్నంగా నాగరాజు ఎదను హత్తుకు పోయింది. అది అతనికి ఎనలేని ఆనందాన్నిచ్చింది. ఆమె చేతులు అతని ముఖాన్ని, వీపును రుద్దసాగాయి. ఆలా ఓ అరగంటపైగా స్నానం చేశాక ఇద్దరూ ఒకరినొకరు పెనవేసుకుని లోపలకు నడిచారు. కొత్తపాకలో నట్టింట కొత్తనులక మంచం, కొత్తపరుపు దాని మీద తెల్ల దుప్పటి పరచి ఉన్నాయి. ఒక చెంబులో పాలు, మరో చెంబులో నీళ్లు, పక్కన అరటిపళ్ళ పళ్లెం! ఎవరబ్బా అమర్చింది? రాజేశ్వరి సిగ్గుతో ముడుచుకు పోయింది. నాగరాజు ఓరగా చూసి, దోరగా నవ్వుతూ,

"ఇందాక గొల్లమ్మ మనకి అవసరమవుతాయి అంటూ మల్లెపూల చెండ్లు, విడి పూలు ఇచ్చింది రాజేశ్వరీ! అమ్మ చూసి అర్థం చేసుకుని ఈ ఏర్పాట్లు చేసినట్టుంది. మంచం పరుపు అన్నీ బజారు నుంచి తెచ్చాం కదా! ఇంక దేనికి

ఆలస్యం?” అంటూ భార్యను ఆపలేని కోరికతో గుండెలకు హత్తుకున్నాడు. అతనికి చేరువైన ఆమె గుండె వేగం హెచ్చింది. ఆ వెచ్చని కౌగిలిలో ఆమె తడిబట్టలు క్షణాల్లో ఆరిపోయాయి.

## 30

“ఏరా, ఇన్నాళ్లు పని నేర్చుకోనన్నావని రామరాజుని తీసుకు పోతున్నా. ఇప్పుడా, నీ మనువయ్యింది. సంపాదన నీది నీకుండాల. ఈ ఏలనుంచి వచ్చేత్తావా మరి?” మర్నాడు పొద్దున్నే కొడుకుని అడిగాడు శ్రీనివాసులు తలెత్తి తండ్రి మొకం లోకి చూడకుండా జవాబిచ్చాడు నాగరాజు.

"నే రానులే, తమ్ముడిని తీసుకుపో!"

“మరి నువ్వేం ఉద్ధరిస్తావంట ఇక్కడ? చదువేమో సంకనాకించావ్!" కఠినంగా అన్నాడు శ్రీనివాసులు. వింటున్న అలిమేలు వత్తాసుకొచ్చింది.

"రెండ్రోజులొాదిలీ వాణ్ని. మొన్నేగా మనువయ్యింది. ఆడు, ఆడిపెళ్ళాం ఆలోసిచ్చుకుంటార్లే” కృతజ్ఞతగా చూసింది రాజేశ్వరి అలిమేలు వైపు. పొద్దున్నే వెళ్ళి కోడలి కోసం గొల్లోళ్ళ ఇంటినుండి పావు సేరు పాలు తెచ్చింది అలిమేలు.

"మాకీ కాపీలు గట్రా అలవాటు లేవు గానీ, నీకేం కావాలో తాగమ్మా. మోమాటం వద్దు." మొహమాట పడింది రాజేశ్వరి. కానీ అప్పటికే పొట్ట కుయ్యో కుయ్యో అంటుండటంతో ఆ పాలు కాచుకుని తాగింది. ఇంట్లో మిగిలిన వాళ్లంతా గంజి తాగారు. ఆపూట రాజేశ్వరి పాక మరికాస్త సర్దారు అత్తాకోడళ్ళు, అన్నదమ్ములు కలిసి. రాజేశ్వరి కిచ్చిన సారెలో కొన్ని ఇత్తడి గిన్నెలు, సామాను ఉన్నాయి. అవన్నీ అమర్చుకున్నారు.

ఇక ముందు గుడిసె వైపుకు వెళ్ళింది రాజేశ్వరి. గుమ్మానికి అడ్డంగా ఆవైపునించి ఈ వైపు మురుగు పారుతోంది. అలిమేలు గిన్నెలు కడిగి అక్కడే నీళ్లు పోస్తోంది. అవి ఇంట్లోకి కూడా వస్తున్నాయి. వెలపరం కలిగింది రాజేశ్వరికి. ఆమె మొహంలో భావాన్ని కనిపెట్టాడు నాగరాజు. అతనికి ఇన్నాళ్లు అవి మామూలుగానే అనిపించాయి. కానీ ఇప్పుడు ఇలా ఉంటే బాగా లేదు.

ఇంటి ముందు పెద్ద గుంత తవ్వించి అందులో ఇసుక, గులక రాళ్ళూ, బొగ్గు పొడి వంటివి నింపి పూడ్పించింది రాజేశ్వరి. పైన మట్టి పోయించింది గుంతలా కనపడకుండా. ఆ గుంత పైన ఉన్న మట్టి మీద అరటి పిలకలు వేయించింది. అరటికి చాలా నీళ్లు కావాలి.

రెండు గుడిసెలకు వెనుక వైపు జాగాలో పెద్ద సిమెంటు తొట్టి పెట్టించి అక్కడే గిన్నెలు కడిగేలా ఏర్పాటు చేసింది అత్తగారినకి కూడా. తన స్నానానికి తనకని ఏర్పాటు చేసిన స్నానాల గది నీళ్ళు, మగవాళ్ళు స్నానాలు చేసిన నీళ్ళు, ఇతరవాడకం నీళ్ళు అన్నీ కలిసి కొత్తగా తవ్విన మురుగు కాలువ ద్వారా ముందున్న గుంటలోకి పోయేలా చేసింది.. అంతే, ఇంటి ముందు మురుగు కట్టు

అలిమేలు సంబరమే సంబరం. ఆవిడ కోడలు చేస్తున్న ప్రతి మార్పుని మనస్ఫూర్తిగా ఆమోదించింది. అంత పెద్దింటి పిల్ల తనను అత్తమ్మా అని నోరారా పిలుస్తుంటేనే ఆవిడకు కొండెక్కినంత సంబరంగా ఉంది. గుడిసె ముందు స్థలంలో కొన్ని పూల చెట్లు వేయించింది రాజేశ్వరి. అత్త గుడిసెకీ, తమ గుడిసెకీ మధ్య కాలి బాటలా స్థలం ఉంచి ఒక వైపు ఆకు కూరలు, మరో వైపు పూల చెట్లు వేయించింది. గుడిసెల మీదకు బీరపాదులు, సొరపాదులు పాకించింది. ఒక మూల కాకరపాదు, మరో మూల దొండ తీగ పెట్టించింది. వాటికి రోజు నీరు పోసే బాధ్యత రామరాజు కప్పచెప్పింది.

ఇంటినిండా వండేప్పుడు గుడ్ల పెంకులు, చేపల పొలుసులు వేసే అలవాటు మాన్పించి వాటిని శుభ్రంగా కాగితాలలో చుట్టి చెత్త పడవేసేందుకని ఒక పాత బుట్టపెట్టి అందులోనే పడవేయాలని నేర్పించింది. తల దువ్వాక జుత్తు, కూరగాయల తొక్కులు, ఇల్లు తుడిచిన చెత్త ఏదైనా ఆ బుట్టలోకే. బయట పడెయ్యటం చాలా తప్పని చెప్పింది అలిమేలుకి. కోడలు మీటే వేదం ఇప్పుడామెకి.

తమ ఇంటి నుంచి పక్కింటికి మురుగు పారట్లేదు కనుక, పక్క వారిది తమ ఇంటి ముందుకి పారకుండా చేసుకొమ్మని చెప్పించింది మామగారి చేత. ఆయన చెప్పినందుకు కాకపోయినా, రాజేశ్వరి మార్పు చేసిన వాళ్ళ ఇంటిని చూసాక అందరూ వాళ్లనే అనుసరించారు. దానితో హరిజనవాడలో మురుగు కనుమరుగు కాసాగింది. ఒక్క వారం రోజులలోనే శ్రీనివాసులు పాక శుభ్రమై పోయింది. పాత, కొత్త పాకల నడుమ వేసిన పూల మొక్కలు, మరో వైపు కూరగాయల మొక్కలు చిన్నగా పెరగటం మొదలు పెట్టాయి.

ప్రహరీ కంచె వెంబడి వరుసగా కొబ్బరి మొక్కలు పెట్టించింది, ఓ పందిరి వేసి పైకి తమల తీగ పాకించింది. కొబ్బరి చెట్ల మధ్యలో వేసిన కనకాంబరం మొక్కలు, మల్లెలు, విరజాజులు, మరువం, కదంబం, గులాబీలు వంటి పూల మొక్కల బాధ్యత అలిమేలుది. ఆమె ఆ బాధ్యత ఆనందంగా స్వీకరించింది. కరివేప మొక్కకి బియ్యం కడుగు నీళ్లు పోయటం అలవాటు చేసింది అలిమేలుకి. గులాబీలకి ఉల్లిపాయల పొట్టు ఎరువు. తరిగిన కూరగాయల మిగులంతా ఒక చిన్న గుంటలో వేయించి సేంద్రియ ఎరువుగా మార్చటం చూపించింది మామగారికి. అక్కడ నించి రోజు వంటింటి చెత్తను ఆయన శ్రద్ధగా ఆ గుంటలో వేసి పైన మట్టితో ఒక పొర కప్పేవాడు. మురారి దగ్గర చుసిన మొక్కల పెంపకపు చిట్కాలు అన్నీ ఇక్కడ పాటించటం మొదలు పెట్టింది రాజేశ్వరి..

ముందు పాకలో నీచు వండటం. వెనుక పాకలో శుద్ధ శాకాహారం. నీచు వండే వేళ వదినమ్మ అటు రాకుండా చూడటం రామరాజు వంతు. బడికి వెళ్లే ఆసక్తి పెద్దగా చూపించని రామరాజు చేత కూరగాయల వ్యాపారం పెట్టించే ఆలోచనలో ఉంది రాజేశ్వరి. అతనికీ అది ఇష్టమే. అత్తగారు పూలను అమ్మకు రావటానికి సిద్ధపడింది. మామగారికి ఆయన వృత్తి ఉండనే ఉంది. ఇక కొత్త దంపతులు పని చూసుకోవాలి.

★★★★★

రోజూ సరిగంగ స్నానాలయ్యాక వీలైనంతవరకు గుట్టు చప్పుడుగాకుండా తొట్టి నింపేస్తారు భార్యాభర్తలు. అదో వేడుక, వాడుక అయిపోయింది వారికి. తరువాతే గుడిసెలోకి అడుగు పెట్టేది. వేరుగా ఉన్న ఇద్దరు ఒకరై, ఆ ఒక్కరూ ఏదో లోకంలో విహరించి వెనక్కి వచ్చాక నాగరాజు రాజేశ్వరిని తన గుండె మీద పడుకో బెట్టుకుని జో కొడతాడు. ఏవో మాటలాడుకుంటూ ఇద్దరూ నిద్ర పోతారు.

భారతి పెళ్లి, మూడు నిద్రల కార్యక్రమమైన తరువాత వెనక్కి వచ్చేసిన రాత్రి అటువంటి సమయంలో రాజేశ్వరి, నాగరాజుని అడిగింది గోముగా.

"రాజా, మనమూ ఏదన్నా ఆలోచించుకోవాలిగా భవిష్యత్తు కోసం. ఏమి చేస్తే బాగుంటుంది? నీకు ఏం చెయ్యటం ఇష్టం?" ఆలోచనలో పడ్డాడు నాగరాజు.

"నా చదువుకి ఎటు తిరిగీ మంచి ఉద్యోగం రాదు. నాన్న వృత్తిని నేను చెయ్యలేను. ఇంకేదన్నా స్వతంత్రంగా సాగే వ్యాపారంలాంటిదైతే బాగుంటుంది. కానీ మన దగ్గర పెట్టుబడి లేదే..." సాలోచనగా అన్నాడు. నాగరాజు.

"నీకు గుర్తుందో లేదో, ఇక్కడకి వచ్చిన రోజు నాన్న నాకు ఐదు వేల రూపాయల రొక్కం ఇచ్చారు. అందులోంచి మనం కేవలం రెండు వందలే ఖర్చు పెట్టాం. మిగిలిన డబ్బుంది రాజా."

"అది నీ డబ్బుకదా రాణీ" వెక్కిరించాడు నాగరాజు.

"ఈ పేరు బాగుంది. నన్ను నువ్వు 'రాణీ' అనే పిలు, ఆ విషయం అటుంచితే, అవి మన సంసారం సుఖంగా సాగడానికి నాన్న ఇచ్చినవి. ఆ ఇనుప పెట్టెలో ఉంటే పిల్లలనేమీ పెట్టవు."

"అయినా అవి నీ డబ్బులు" అయిష్టంగా అన్నాడు నాగరాజు.

"మన మధ్య నీ నా ఉండకూడదు. పోనీ ఒక పని చెయ్యి. నువ్వు చేసే వ్యాపారంలో వచ్చే లాభంతో నా అప్పు తీర్చేద్దువుగాని. ఇంతకీ ఏం వ్యాపారం ఆలోచించావు?"

"కిరాణా వ్యాపారం. మన పేట వారు నలుగురితోపాటు దుకాణానికి వెళ్తే అందరూ వెళ్లే వరకు వారికి సరుకులు ఇవ్వరు. అవీ పైనించి పడేస్తారు." రాజేశ్వరికి ఒక్క సారిగా భారతి పెళ్ళిలో తాను ఎదుర్కొన్న అవమానాలు గుర్తుకు వచ్చాయి.

"నిజమే. అయితే...?

"మన పేట లోనే కిరాణా దుకాణం పెట్టి అన్ని సరుకులు పెడతా. ఇక్కడ నించి ఎవ్వరూ ఊళ్ళో కొట్లకి వెళ్లే పని ఉండదు." ఆలోచించింది రాజేశ్వరి.

"దాని పైన హరిజనులకు మాత్రమే అని రాయిస్తాను." ఆవేశంగా అన్నాడు నాగరాజు.

"అది తప్పు రాజా, మనం పొరపాట్లు చెయ్యకూడదు. ఎవరన్నా కొనుక్కోనీ, మనకేం నొప్పి? ఇంకా సరిగ్గా చెప్పాలంటే ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమైనవి, వాళ్ళ దుకాణాల్లో దొరకనివి కూడా పెట్టి, వాళ్ళు మన కొట్టుకి వచ్చేలా చేయటం ద్వారా, మనకీ వాళ్ళకీ ఉన్న సామాజికదూరం దూరమయ్యేలా చూడవచ్చు." నాగరాజు నవ్వాడు.

"నువ్వు ఆశావాదివి."

"ఏమో... భవిష్యత్తులో కులమతాలకు అతీతమైన సమాజం ఒకటి వస్తుందేమో!"

"రాదు రాణీ, అది నీ పిచ్చి. మానవులందరూ ఎప్పటికీ సమానులు కారు, కాలేరు. ఏదో రకమైన అడ్డుగోడలు వారి మధ్య ఉంటూనే ఉంటాయి. కుల మతాతీత సమాజం కేవలం మహనీయుల కాలాల్లోనే ఉండేది" నాగరాజు ఆవేశం పెరిగింది. లాలనగా అతని తలమీద చెయ్యి వేసి నిమిరింది రాజేశ్వరి.

"పోనీలే, ఆ గొడవ వదిలేద్దాం. మన వ్యాపారానికి మా నాన్న నాకిచ్చిన డబ్బు ఖర్చు పెట్టి, మనం నిలదొక్కుకున్నాక దాన్ని పెట్టుబడి లోంచి తీసేద్దాం సరేనా?" అతని కళ్ళమీద సునినితంగా ముద్దు పెట్టుకుంటూ అడిగింది.

"నీకు మనుషుల్ని ఎలా ఒప్పించాలో బాగా తెలుసు రాణీ. నీ ఇష్టం" అన్నాడు నాగరాజు తన కళ్ళమీది ఆమె పెదవుల స్పర్శను ఆస్వాదిస్తూ.

అతని ముక్కు పొడవుని కొలుస్తూ, అలాగే నిద్రలోకి జారుకుంది రాజేశ్వరి. ఆమె నుదుట బొట్టు మీద ముద్దు పెట్టి, ఆమెకు జో కొడుతూ అలాగే నిద్రపోయాడు నాగరాజు.

★★★★★

నాగరాజు వాళ్ళు ఉండే పేట చివరిలో ఒక చిన్న దుకాణం అమ్మకానికి వచ్చింది. అది నచ్చటంతో తండ్రి సహాయంతో బేరం కుదుర్చుకున్నాడు నాగరాజు. తల్లి చేతుల మీదుగా కొబ్బరి కాయ కొట్టించి సరుకుల్ని కొన్నాడు. ఇంటిల్లి పాది నాలుగు రోజులు కష్టపడి ఆ దుకాణాన్ని ఒక ఆకారానికి తెచ్చారు. దాని పేరు "అలిమేలు మంగ కిరాణా దుకాణం." అలిమేలు ఆనందానికి హద్దే లేదు.

"నా కోడలంత ఉత్తమురాలు ఎక్కడా ఉండ" దని ఊరంతా టముకు కొట్టింది. ఆ దుకాణంలో నాగరాజు, ఎప్పుడన్నా రాజేశ్వరి కూర్చుంటున్నారు.. దాని ముందే నాలుగు బల్లలు వేసి రామరాజు కూరగాయల కొట్టు మొదలు పెట్టాడు. రెండవ వైపు ఒక చిన్న బల్లమీద అలిమేలు పూల జంగిడి పెట్టుకుంది.

వీళ్ళ వ్యాపారం జనానికి తెలిసి కాస్త కొట్టుకి రావటం మొదలు పెట్టటానికి ఒక వారం పట్టింది. ఇప్పుడు దుకాణం పెట్టి రెండు నెలలౌతోంది. వ్యాపారం బాగా జరుగుతోంది. దుకాణంలో పెట్టిన సరుకులు పెంచారు కూడా.

ఇక ఇంటిముందు చక్కని పూల తోట తయారయ్యింది.. ఆకుకూరలు, కూర గాయల మొక్కలు కోత కొచ్చాయి. ఇంట్లో ఒక మట్టిముంత పెట్టింది రాజేశ్వరి. వారి ఖర్చులు పోను, మిగిలిన డబ్బులు అందులో వేయాలి. ఎవరి సంపాదనైనా సరే. తరుచు అందులో డబ్బులు పడుతున్నాయిప్పుడు. ఇంట్లో పండించిన కూరగాయలు వంటకి వాడగా, ఇంకా చాలా మిగులుతున్నాయి. అవన్నీ రామరాజు కొట్టుకి చేరుతుంటే, పూలన్నీ అలిమేలు జంగిడిలో కొలువు తీరుతున్నాయి. మిగిలినవి. ఇక తన డబ్బులతోనే శ్రీనివాసులు ఒప్పించి మంచి సెంటర్లో కొట్టు పెట్టించింది రాజేశ్వరి. ఇదివరకులా అతను ఇప్పుడు ఎవ్వరి ఇంటికీ వెళ్లట్లేదు.

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS